క్లుప్తంగా

కబడ్డీ జట్టుకు అభినందన



కబడ్డీ జట్టు సభ్యులను అభినందించి, సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో 92వ వార్డు వెంకటాపురానికి చెందిన కబడ్డీ జట్టు నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలవడంతో జట్టు సభ్యులను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఆయన్ను ఇంటి వద్ద జట్టు సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నాయకులు కంపర రామకృష్ణ, అభిరామ్, అట్టా శంకర్ పాల్గొన్నారు.

రెల్లికుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎంపిక



సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీ(షిప్‌యార్డ్ కాలనీ) గాంధీగ్రామ్ రెల్లికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా సోమాదుల సురేష్ ఎన్నికయ్యారు.అధ్యక్షుడిగా రౌతు ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ధనాల సీతారామ్, రౌతు జగన్నాథరావు, జనరల్ సెక్రటరీగా గంగ్రేడి నర్సింగమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా ధనాల సోమేశ్వరరావు, ధనాల వెంకటరావు, అడిసినల్ సెక్రటరీగా బొందల కిషోర్, ఆర్గనైజింగ్ సెకట్రరీగా ఆరుగుల శ్రీను, ఆడిటర్‌గా బొమ్మాల శ్యామ్, కోశాధికారిగా రౌతు సాయి ఎంపికయ్యారు.

సంతోష్‌కుమార్‌కు సత్కారం



డిప్యూటీ మేయర్ శ్రీధర్ కుటుంబ సభ్యులతో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ సంతోష్‌కుమార్

విశాఖ విద్య: కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్ వ్యవహారాలు నిర్వహిస్తున్న ఐసీఏఎస్ సంతోష్‌కుమార్‌ను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ సత్కరించారు. ఆదివారం శ్రీధర్ నివాసంలో అల్పాహార విందుకు ఆయన హాజరయ్యారు. సంతోష్‌కుమార్‌ను శ్రీధర్ కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీకి దేశంలోనే పరిశుభ్రమైన నగరంగా 4వ స్థానం రావడంపై శ్రీధర్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

వేటూరి గీతాలతో సంగీత విభావరి రేపు

సీతంపేట: సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి 88వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వేటూరి రచించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళా పీఠం కార్యదర్శి గంటి మురళి తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయని గాలిదేవర సాహితిని వేటూరి యువ గాయని పురస్కారంతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. సినీ గాయని సాహితి, రమేష్ పట్నాయక్, శంబర జోగారావు, బాల గణేష్, హారిక, పట్నాయక్, లిపికారెడ్డి తదితరులు వేటూరి గీతాలను ఆలపిస్తారన్నారు.

ఆహ్లాదం.. ఆనందం.. భద్రత

- చిన్నారులకు ప్రత్యేక ఆట పరికరాలు
- వుడా లేఅవుట్ పార్కుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- మోడల్ పార్కుగా తీర్చిదిద్దిన యంత్రాంగం



గ్రీనరీ మధ్య వాకింగ్ ట్రాక్

విశాఖ విద్య: నగరంలో పార్కులు ముచ్చట గొల్పుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రశాంతత పంచుతున్నాయి. చిన్నారులకు వినోదాన్ని అందిస్తున్నాయి. పెద్దలకు కాలక్షేపంతో పాటు వ్యాయామ పరికరాలు, పచ్చని చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో ఆరోగ్య వనాలుగా మారాయి. అలాంటి పార్కుల్లో ఒకటి మద్రిపాలెం వుడాలేఅవుట్ పార్కు.



వ్యాయామ పరికరాలు

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 52వ వార్డు వుడా కాలనీ వాసుల సౌకర్యార్థం పలు చోట్ల పార్కులను అభివృద్ధి చేశారు. వీటిలో ప్రధానంగా కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు చూడముచ్చటగా ఉంది. విశాలమైన పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయడంతో ఇక్కడ ఎక్కువ సేపు గడిపేందుకు కాలనీ వాసులు ఆసక్తి చూపుతున్నారు. చిల్డ్రన్స్ పార్కు అయినప్పటికీ, వుడా కాలనీలో ఉండే పిల్లలు, వృద్ధులు, ప్రధానంగా మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా తగిన సౌకర్యాలు కల్పించారు. కాలనీ వాసుల విన్నపం మేరకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని పార్కును ఆధునికీకరించేలా జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయింపు చేశారు. దీంతో ఎన్‌ఏడీలో పార్కులన్నింటిలో ఇది ఎంతో సుందరంగా కనిపిస్తోంది. లోపలకు వెళ్లిన వారు సమయం తెలియకుండా గడుపుతున్నారంటే అతిశయోక్తి కాదు. పచ్చని చెట్లు, వాటి కింద కూర్చొనేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశారు. ఇక్కడ విశాలమైన షటిల్ కోర్టు కూడా అందుబాటులో ఉంది.



పచ్చదనం మధ్య కూర్చునేందుకు వీలుగా పార్కులో ఏర్పాట్లు

సీసీ కెమెరాలతో రక్షణ

పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారు. తమ సామాజిక బాధ్యతగా వుడా కాలనీ వాసులు చిల్డ్రన్స్ పార్కు పరిరక్షణకు ముందుకొచ్చారు. కాలనీ అసోసియేషన్ ద్వారా ఇక్కడ సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేశారు. పార్కుకు వచ్చే వారికి ఎలాంటి అభద్రత లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



వుడా కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు



పార్కులో షటిల్ కోర్టు

ఆహ్లాదకరంగా ఉంది



వుడా కాలనీలోని అన్ని పార్కులను జీవీఎంసీ ద్వారా అభివృద్ధి చేశారు. పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పిల్లలకు ఆట వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. అందుకే నిర్వహణ బాధ్యతను కాలనీ అసోసియేషన్ తీసుకున్నాం. అందరి అవసరాలకు ఉపయోగపడుతోంది. పార్కుల నిర్వహణ చూసుకోవడం మా బాధ్యత.

– సీహెచ్‌వీ.సురేష్, కాలనీ అసోసియేషన్ కార్యదర్శి

అందరికీ ఉపయోగకరంగా



ప్రజానీకం అందరికీ ఉపయోగకరంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. వుడా కాలనీలోని అన్ని పార్కులను ఇప్పటికే ఆధునికీకరించాం. వుడా కాలనీకి ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను కూడా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా పనులు చేస్తున్నాం. చిల్డ్రన్ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దాం,

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

మళ్లకు శుభాకాంక్షలు



మళ్ల విజయప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపాలకృష్ణ తదితరులు

గోపాలపట్నం: విశాఖ పార్లమెంట్ పార్టీ పరిశీలకుడిగా నియమితులైన మళ్ల విజయ ప్రసాద్‌ను ఆయన నివాసంలో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యదర్శి గవర నాయుడు, వార్డు నాయకులు హరి, విజయ్, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఉల్లాసంగా...ఉత్సాహంగా...

ఆత్మీయ కలయికలో ఆటపాటలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శివాజీ పార్కులో ఎన్ఏడీ కొత్తరోడ్ ఏరియా గౌరీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ కలయిక పేరిట నిర్వహించిన వేడుక ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. కాలనీ వాసులంతా ఒకే చోట చేరి రోజంతా గడిపారు. సమైక్యతకు చిహ్నంగా వనభోజనాలు చేశారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు, పిల్లలతో పాటు మగవారికి పలు ఆటల పోటీలను నిర్వహించారు. లెమన్ స్పూన్, సూదిలో దారం, మ్యూజికల్ చైర్స్ ఇలా వినూత్న ఆటలు ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. లక్కీ డిప్ ద్వారా బెస్ట్ కపుల్స్‌ను ఎంపిక చేసి సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఆత్మీయ కలయిక నిర్వహించడం మంచి పరిణామమన్నారు. గౌరీ సంఘం అధ్యక్షుడు కాళ్ల మోదినాయుడు, కార్యదర్శి బిల్డర్ శ్రీను, కోశాధికారి రాపేటి రమణ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో లీడర్ రమణమూర్తి, బొడ్డేటి తాతారావు, ఆడారి అప్పారావు, రాంజీ తదితరులు పాల్గొన్నారు.



వేడుకను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



పాటలు పాడుతున్న మహిళలు

గౌరీసంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్ గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాళ్ల మోదినాయుడు, గౌరవ అధ్యక్షుడిగా దాడి రామారావు, కార్యదర్శిగా పాలిమేర వెంకట ఆదినారాయణ, కోశాధికారిగా రాపేటి రమణ ఎన్నికయ్యారు. అదే విధంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీవీ రామారావు, ఉపాధ్యక్షులుగా ఆడారి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా యల్లపు వెంకట గణేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుమార్, ఆడిటర్‌గా ఆడారి భాస్కరరావు ఎన్నికయ్యారు. కేంద్ర సంఘం అధికారి ప్రతినిధిగా దాడి వెంకటరమణ, న్యాయసలహాదారుగా పొలమరశెట్టి రాంజీతో పాటు పలువురు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి 'ఆడారి' విరాళం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీ బీసీ కాలనీలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం శిథిలమవుతుండటంతో దాని స్థానంలో కొత్త విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ రూ.60 వేల విరాళం అందించారు. ఆదివారం కాలనీలో యువజన సంఘ సభ్యులకు ఆ నగదును జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టమొచ్చినా వెంటనే స్పందించే నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్ అని అన్నారు. ఇటీవల సంఘ పెద్దలు ఆయనను కలిసి నూతన అంబేడ్కర్ విగ్రహం నిర్మాణానికి ఆర్థిక సాయం అందివ్వాలని కోరిన వెంటనే నగదు మంజూరు చేశారని చెప్పారు. ఇటువంటి మంచి నాయకుడికి అంతా అండగా నిలవాలని, పశ్చిమలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని బెహరా కోరారు. కార్యక్రమంలో పార్టీ 92, 91 వార్డుల అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కొవర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాస రెడ్డి, కవర సత్తిబాబు, కంపర రామకృష్ణ, మల్లేటి భీమయ్య, ఎద్దు దేవుళ్లు, అరుణ్‌కుమార్, బల్ల రమణ, సాలాపు రమణ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులకు నగదు అందిస్తున్న బెహరా భాస్కరరావు

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

మురళీనగర్: విశాఖ మాస్టర్స్ అథ్లెట్‌లు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి బంగారు పతకాలు సాధించాలని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆకాంక్షించారు. ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కార్యదర్శి మంగ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను వరప్రసాద్ అందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ విజన్ డెవలపర్స్ అధినేత ఎం.శ్రీరామమూర్తి 50 మందికి క్యాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరభద్రరావు, ఎం.శ్రీనివాస్ రాజు, పోలీస్ శాఖ నుంచి క్రీడాకారులు జె.ఉష, బాలరాజు, అనురాధ, డాక్టర్ భాగ్యలక్ష్మి, సరోజిని, బాలరాజు, వనిత వాకర్స్ క్లబ్ కార్యదర్శి జయ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస రాజు, యూనివర్సల్ యూత్ అధ్యక్షుడు వంశీ, శశికుమార్, రాజ్యలక్ష్మి ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.



మాస్టర్ అథ్లెట్స్‌కు ట్రాక్ సూట్‌లు అందిస్తున్న సనపల వరప్రసాద్

ఎక్స్–సర్వీస్‌మెన్‌పై కత్తితో దాడి

మల్కాపురం: తన సొంత స్థలంలో అనధికార నిర్మాణం చేపడుతున్న వ్యక్తిని ప్రశ్నించిన తనపై దాడి చేశాడని ఓ ఎక్స్–సర్వీస్‌మెన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై బాధితుడు తెలిపిన వివరాలిలా.. 59వ వార్డు ఎక్స్–సర్వీస్‌మెన్ కాలనీలో 200 గజాల స్థలాన్ని ఆర్.శంకర్‌రావు అనే ఎక్స్–సర్వీస్‌మెన్ హైదరాబాద్‌కు చెందిన రేవతి అనే మహిళ వద్ద కొనుగోలు చేశాడు. దానిలో సుమారు 50 గజాల స్థలంలో స్థానికంగా ఉంటున్న కృష్ణ అనే వ్యక్తి అక్రమ నిర్మాణం జరిపాడని బాధితుడి ఆరోపణ. దీనిపై శనివారం రాత్రి ప్రశ్నించిన పాపానికి కృష్ణ కత్తితో అతడి తలపై దాడి చేయడంతో మల్కాపురం పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు శంకర్‌రావు వివరించాడు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ సన్యాసినాయుడిని వివరణ కోరగా.. దీనిపై విచారణ చేపడుతున్నామని, అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎక్స్ ఆర్మీ అయిన తనకు రక్షణ లేదని, తన సర్వీస్‌లో దాచుకున్న సొమ్ముతో ఇక్కడ స్థలం కొన్నానని, అది కబ్జాదారుల చేతిలోకి వెళ్లిన పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుడు శంకర్‌రావు ఆరోపిస్తున్నాడు.



దాడిలో గాయపడిన శంకర్‌రావు

అ'పూర్వ' సమ్మేళనం



యారాడ అగ్రిగోల్డ్ పార్కులో పూర్వ విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు యారాడలోని అగ్రిగోల్డ్ పార్కులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. అలాగే తమతో పాటు కలసి చదువుకున్న సహచర మిత్రులు ఆర్థిక సమస్యలతో బాధపడుతుంటే ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ముందుగా తమతో కలిసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీత నాగరాజు, ఈశ్వరరావు, మహ్మద్ వల్లీ, గోవింద్, బోగేష్, వెంకటేష్, కండిపిల్లి సత్యనారాయణ, గొందేశి అరుణ తదితరులు పాల్గొన్నారు.

7న చలో ఢిల్లీ



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల 7న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉక్కు సీడబ్ల్యూసీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని, వారికి ఎటువంటి ఉపాధి కల్పించకపోవడంతో ఇళ్లల్లో పాచి పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్ట్రటజికల్ సేల్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి చూస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విజేత కస్టమర్స్ ఎలెవెన్



ఇరు జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్, కస్టమర్స్ ఎలవెన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో కస్టమర్స్ ఎలెవెన్ జట్టు గెలుపొందింది. కస్టమర్లతో సత్సంబంధాల పెంపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం టీ–20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన కస్టమర్స్ ఎలెవన్ జట్టు 20 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 131 పరుగులు మాత్రమే చేసింది. స్టీల్‌ప్లాంట్ జట్టుకు డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి కెప్టెన్‌గా వ్యవహరించగా కస్టమర్స్ జట్టుకు నగేష్ కెప్టెన్‌గా జట్టుకు నేతృత్వం వహించారు. అనంతరం డి.కె. మొహంతి, నగేష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. స్టీల్ ప్లాంట్ జట్టుకు చెందిన డాక్టర్ నవీన్ బెస్ట్ బ్యాటర్‌గా, కస్టమర్స్ జట్టుకు చెందిన రామారావులు బెస్ట్ బౌలర్‌గా బహుమతులు అందుకున్నారు.

30న దుకాణాలు, మార్కెట్లకు వేలం

కంచరపాలెం: జోన్–5 పరిధిలోని పలు వార్డుల్లో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 30న జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సంజీవయ్య కాలనీ, అశోక్‌నగర్, గుల్లలపాలెంలోని దుకాణాలకు, కంచరపాలెం నేతాజీ వంతెన నుంచి మద్రిపాలెం వరకు, అక్కయ్యపాలెంలో రోడ్డు పక్కన మార్కెట్లు, జనతా కాలనీలో కారం మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు, మాధవధారలోని మాధవ స్వామి కల్యాణ మండపానికి వేలం జరుగుతుందని చెప్పారు. వేలంపాటలో పాల్గొనే ఔత్సాహికులు మంగళవారం ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలని జెడ్సీ కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొట్టాలి

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న జరుగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1081 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్ఎమ్ఎస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇక పై అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు.



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

విద్యతోపాటు మానవీయ విలువలు అవసరం

ఎంవీపీ కాలనీ: శ్రీసత్య సాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ బసంత్ కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు